ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 నంద్యాల

జిల్లా వార్తలు

ఆదివారం 14 ఏప్రిల్ 2024

ఓటుకు.. పట్టం కట్టేలా..!



నంద్యాల టౌన్, ఏప్రిల్ 13:

నెల రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కొత్త పద్ధతులను అమలు చేస్తూ.. పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. గతంలో జరిగిన ఎన్నికలకు భిన్నంగా ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని గణనీయంగా పెంచడంతోపాటు యువ ఓటర్లు ఓటు హక్కును ఎక్కువ శాతం వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయబోతున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యాచరణ అంశాలను ఎన్నికల కమిషన్ నుంచి జిల్లా స్థాయి ఎన్నికల నిర్వహణ అధికారులకు ఇప్పటికే పలు సూచనలు, ఆదేశాలు వచ్చాయి.

- పోలింగ్ శాతం పెంపుపై ఈసీ ఫోకస్
- సార్వత్రిక ఎన్నికల్లో కొత్త పద్ధతులకు శ్రీకారం
- యువత ఓటింగ్ పెంపుపై ప్రత్యేక దృష్టి
- వయో వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు
- స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
- ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఈసీ



వయోవృద్ధులకు ఇంటి వద్దే ఓటు!

ఓటింగ్ పెంపుపై ప్రత్యేక దృష్టి

జిల్లాల్లోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ఓటర్ జాబితా దాదాపుగా ఖరారైంది. ఇందులో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్ ఓటర్ల వివరాలతో కూడిన జాబితా విడుదల చేశారు. అయితే ఎన్నికల కమిషన్ నిర్ణయించిన మేరకు ఈనెల 15వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదుకు గడువు ఉన్న నేపథ్యంలో ఇటీవల అధికారికంగా జిల్లా ఎన్నికల అధికారులు విడుదల చేసిన నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో సంఖ్య స్వల్ప మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఖరారైన ఓటరు జాబితాలో యువ ఓటర్లు ఎక్కువ మంది ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది కూడా యువతే ఉండేలా కార్యాచరణ అమలు చేయనున్నారు. సమాజాభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషించే యువతను పోలింగ్ కేంద్రాల వైపు నడిపించేలా, ఓటు విలువను తెలుసుకుని ఓటు హక్కును వినియోగించుకునేలా వారిని ప్రోత్సహించేందుకు వినూత్న కార్యక్రమానికి ప్రస్తుతం జరగబోయే ఎన్నికలు వేదిక కాబోతున్నాయి. గతంలో మహిళలు, దివ్యాంగుల ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీరి తరహాలోనే ఈ దఫా ఎన్నికల్లో యువ ఓటర్ల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతుండటం విశేషం.



తెలంగాణలో గతేడాది నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం వయోవృద్ధులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంది. ఇది అక్కడ సత్ఫలితాలను ఇచ్చింది. దీంతో ఈ ఏడాది దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేసేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, అనారోగ్యంతో మంచంలో ఉండి కదల్లేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు తమ తమ ఇళ్ల వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాధారణ ఓటర్లతో పాటు దివ్యాంగులు, వృద్ధులు కూడా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ఎంతో మంది వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళకపోవడంతో వారి పోలింగ్ శాతం తగ్గిన నేపథ్యంలో ప్రత్యేక ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి ఇంటి వద్దనే ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తారు. 40 శాతం పైబడి అంగవైకల్యం ఉన్నవారు, కదలలేని స్థితిలో ఉన్నవారు తమ ఇళ్ళ వద్ద నుంచే పోస్టల్ బ్యాలెట్ పొందడానికి అర్హులుగా భావించడం జరుగుతుంది.

ప్రస్తుతం జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని గత ఎన్నికల కంటే 10 నుంచి 20 శాతం వరకు పెంచడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ ప్రత్యేక మార్గదర్శకాలను అమలు చేయబోతున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. గత ఎన్నికల్లో సరాసరి నమోదు శాతాన్ని ఈ సారి ఎలాగైనా పెంచాలని దృఢ సంకల్పంతో అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఓటు హక్కు వినియోగానికి క్షేత్రస్థాయిలో ఉండే తాత్కాలిక ఇబ్బందులను తొలగించడం, అనుమానాలను నివృత్తి చేయడం కోసం ప్రత్యేక దృష్టి సారించనున్నారు.



ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది (ఫైల్)

తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం వద్ద ఉందో తెలియకపోవడం, ఒకే కుటుంబంలోని సభ్యులకు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో వారి ఓట్లు ఉన్న నేపథ్యంలో ఈ ఇబ్బందులను తొలగించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన హెల్ప్ లైన్‌ను స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చింది. 'మై ఓటర్ హెల్ప్ లైన్' యాప్‌ను సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని, ఓటర్ కార్డు ఎపిక్ నంబరును ఎంటర్ చేస్తే ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలో వివరాలు డిస్‌ప్లే అవుతాయి. అందుకు అనుగుణంగా ఓటు వేసే విషయంలో గందరగోళ పరిస్థితుల్లో ఉన్నవారి అనుమానాలు నివృత్తి కావడం ద్వారా ఓటు హక్కు వినియోగం పెరిగి ఓటింగ్ శాతంలో గణనీయమైన మార్పు చోటు చేసుకుంటుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

'స్వీప్' ద్వారా అవగాహన

ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఓటు వేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం స్వీప్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ (ఎస్‌డబ్ల్యుఈఈపీ) ద్వారా చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికై ఓటు వేయడం మన హక్కు, ప్రజాస్వామ్యంలో ఓటు అతి బలమైన ఆయుధం అనే నినాదాలతో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. 2కే రన్ నిర్వహించి ఓటర్లను చైతన్యపరుస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మొబైల్ వాహనాల ద్వారా ఓటు విలువ, పోలింగ్ సమాచారం, ఇతర




ఓటు ప్రాధాన్యతను వివరిస్తున్న కలెక్టర్ (ఫైల్)

వివరాలను కళా బృందాలతో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులతో పాటు మైక్‌ల ద్వారా ఓటు విలువ తెలిసేలా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వ యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ క్షేత్రస్థాయిలో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం, ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు, గిరిజన తండాలు, మురికి వాడల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన ఎన్నికల్లో సరాసరి ఓటింగ్ శాతానికి దాదాపు 20 శాతం ఓటింగ్ పెరిగేలా కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

2,960 బొట్టు బిళ్లలతో అంబేడ్కర్ చిత్రం



సాయి హవీష్



బొట్టు బిళ్లలతో అంబేడ్కర్ చిత్రం

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 13: నంద్యాలకు చెందిన రమేష్, స్వర్ణ దంపతుల కుమారుడు సాయి హవీష్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా 2,960 బొట్టు బిళ్లలతో అంబేడ్కర్ చిత్రాన్ని తయారు చేశాడు. స్థానిక కోటేష్ ఆర్ట్ అకాడమీలో 14ఇంటు 10 అంగుళాల వెడల్పు గల డ్రాయింగ్ చార్టు మీద 0.2 ఎం.ఎం. సైజు గల బొట్టు బిళ్లలతో అంబేడ్కర్ చిత్రాన్ని తయారు చేశాడు. సాయి హవీష్ గతంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో బంగారు పతకాలు సాధించారు.

ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌పై ఎస్పీ సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 13 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్‌పై ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. శనివారం ఆయన నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లు, ముందస్తు చర్యలపై చర్చించారు. సమస్యాత్మక గ్రామాలు, వార్డులు, అక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తీసుకున్న చర్యలు, ఓటర్ల వివరాలు, ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు, పోలింగ్ స్టేషన్లు, ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన స్పెషల్ టీంలు, చెక్‌పోస్టులు, అక్కడ పని చేసే పోలీస్ అధికారుల పనితీరు గురించి తెలుసుకున్నారు. అలాగే ఇప్పటి వరకు సీజ్ చేసిన వాటి వివరాలు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్‌ల పని తీరుపై అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలపై కూడా వాకబు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటి వరకు డిపాజిట్ చేసుకున్న ఆయుధాల గురించి, ఎగ్జిక్యూట్ చేసిన వారెంట్లు, బైండోవర్లు, ఏ విధంగా బైండోవర్ చేశారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే నేర చరిత్ర గలవారి వివరాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో జరిపిన ఫ్లాగ్‌మార్చ్ వివరాలు, అక్కడ స్థానికులకు ఇచ్చిన కౌన్సెలింగ్ వివరాలను తెలుసుకున్నారు. పోలింగ్ రోజు ఎంతమంది సిబ్బంది అవసరమవుతారు, ప్రస్తుతం ఎంతమంది సిబ్బంది అందుబాటులో ఉన్నారన్న వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికలలో నమోదైన కేసుల వివరాలు, వాటి ప్రస్తుత పరిస్థితిని వివరించి వాటిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ఎన్నికల్లో ఇబ్బందులు తలెత్తకుండా తీసుకునే జాగ్రత్తలపై, ఇంతవరకు బైండోవర్ చేసిన వారి వివరాలు తెలుసుకొని అవసరమైన సలహాలు, సూచనలు స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందికి చేశారు. కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్, ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జయరాములు, ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఓటు హక్కు వినియోగానికే సాయుధ బలగాల కవాతు

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేందుకే కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, ట్రైనీ డీఎస్పీ రఘువీర్‌లు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే ధ్యేయంగా కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, ట్రైనీ డీఎస్పీ రఘువీర్, ఆళ్లగడ్డ పట్టణ సీఐ ఎం.రమేష్‌బాబు, రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్సైలు నగీన, నరసింహులు, కేంద్ర సాయుధ బలగాల అధికారులు, సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టోల్‌గేట్ రగడ

- శ్రీశైలం దేవస్థానం టోల్‌గేట్‌పై అటవీశాఖ అభ్యంతరం
- తమ పరిధిలో ఉందంటూ ఫీల్డ్ డైరెక్టర్ హల్‌చల్
- డబ్బులు తీసుకోకుండానే వాహనాలను పంపించేసిన వైనం



టోల్‌గేట్ వద్ద సీఎస్‌వో పర్యవేక్షణ

శ్రీశైలం, ఏప్రిల్ 13: శ్రీశైలం దేవస్థానం టోల్‌గేట్‌పై అటవీశాఖ అధికారులు ఆధిపత్యానికి దిగారు. శనివారం రాత్రి అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్ మూర్తి తమ సిబ్బందితో వచ్చి టోల్‌గేట్ వద్ద హల్‌చల్ చేశారు. ప్రస్తుతం శ్రీశైలం టోల్‌గేట్ అటవీశాఖ భూ భాగంలో ఉందంటూ సదరు అటవీశాఖ అధికారులు హంగామా సృష్టించారు. భక్తుల వాహనాల నుంచి రుసుము వసూలు చేయకూడదంటూ అరగంటకు పైగా వాహనాలను వదిలివేశారు. ఈ ఘటనతో టోల్‌గేట్‌లో విధులు నిర్వహిస్తున్న స్బిబంది ఖంగుతిన్నారు. వెంటనే సమాచారాన్ని టోల్‌గేట్ సిబ్బంది దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్నకు సమాచారం ఇవ్వగా అటవీ శాఖ అధికారులతో వివాదంపై చర్చించారు. సీఎస్‌వో అయ్యన్న టోల్‌గేట్ వద్ద సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకుని యథావిధిగా వాహనాలకు టోల్ టిక్కెట్లు జారీ చేశారు. అయితే గత ఎడాది కిందట శ్రీశైల దేవస్థానం భూముల సరిహద్దులపై రెవెన్యూ, అటవీశాఖ, ల్యాండ్ సర్వే శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. దేవస్థానానికి సుమారు 4,433 ఎకరాల భూమి ఉన్నట్లు సర్వే మ్యాపుల ద్వారా గుర్తించారు. కానీ ఏడాది పాటు దేవస్థానంతో ఎటువంటి సంప్రదింపులు చేయకుండా ఉన్నఫలంగా శ్రీశైలం దేవస్థానం టోల్‌గేట్‌ను అటవీ శాఖ భూ భాగంలో ఉందని వివాదం రేపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటవీశాఖ అధికారులు సృష్టించిన వివాదాన్ని పరిష్కరించాలంటే రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు జోక్యం తప్పనిసరైంది. ఇటీవల ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయానికి జీపులను నడిపే నిర్వాహకుల చెల్లింపుల్లో పది శాతం కోత పెడుతూ ఫీల్డ్ డైరెక్టర్ తీసుకున్న నిర్ణయంతో చెంచు గిరిజనులు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే.

ఆమె మరణించినా నలుగురికి ప్రాణదానం



తిరుపతికి గుండె, లివర్‌ను తరలిస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 13: ఆమె మరణించినా మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపింది. అవయవ దానంతో ఆ నలుగురికి ప్రాణం పోసింది. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దొంతు కృష్ణవేణి (38)కి ఫిట్స్ రావడంతో ఆమె భర్త రామభద్రయ్య గురువారం కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. రోగిని పరిశీలించిన వైద్యులు తలలో రక్తం గడ్డ కట్టినట్టు గుర్తించారు. శనివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయింది. అవయవ దానంపై కోఆర్డినేటర్లు మృతురాలి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం భర్త కుటుంబ సభ్యులు అంగీకరించడంతో రెండు కిడ్నీలు, లివర్, గుండెలను దానం చేశారు. చనిపోతూ కూడా మరో నలుగురికి ప్రాణదానం చేయడం తమకు గర్వంగా ఉందని కృష్ణవేణి భర్త రామభద్రయ్య పేర్కొన్నారు.

గ్రీన్ చానల్ ద్వారా తరలింపు: బ్రెయిన్ డెడ్ అయిన కృష్ణవేణి లివర్, గుండెను పోలీసులు గ్రీన్ చానల్ ద్వారా తరలించారు. గుండెను పద్మావతి మెడికల్ కాలేజీకి, లివర్‌ను స్విమ్స్‌కు విమానం ద్వారా తరలించారు. అదేవిధంగా రెండు కిడ్నీలలో ఒకటి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి, మరొకటి కర్నూలు కిమ్స్‌కు అందించారు. జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాంబాబు ఆధ్వర్యంలో కర్నూలు ట్రాఫిక్ పోలీసులు విమానంలో తిరుపతికి తరలించారు.

భక్తిపారవశ్యం...

చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం

- 400లకు పైగా జ్యోతులతో అమ్మవారికి నివేదన
- జనసంద్రమైన నందవరం



చౌడేశ్వరీదేవి రథోత్సవం

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 13: జిల్లాలో ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న నందవరం చౌడేశ్వరీదేవి ఆలయంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం జ్యోతుల ఉత్సవం అశేష భక్తజన సందోహం నడుమ కన్నులపండువగా సాగింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దాదాపు 400లకు పైగా జ్యోతులను భక్తులు అమ్మవారికి నివేదనగా సమర్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ జి.కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భాస్కరయ్యాచారిచే అమ్మవారికి దిష్టిచుక్క పెట్టే వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రాత్రి 2 గంటలకు చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నుంచి జ్యోతి మహోత్సవం ప్రారంభమైంది. తొగటవీర క్షత్రియులు అమ్మవారి జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యం చేస్తూ, అమ్మవారిని స్మరిస్తూ డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నడిచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. రాత్రి 2 గంటలకు ప్రారంభమైన జ్యోతుల ఊరేగింపు శనివారం ఉదయం 9గంటల వరకు సాగింది. చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవానికి వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు వసతులను కల్పించారు. నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె రూరల్ సీఐ తిమ్మారెడ్డి, పత్తికొండ సీఐ గంటా సుబ్బారావు, నందివర్గం ఎస్ఐ తిరుపాలు పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.





జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

రమణీయం.. రథోత్సవం

ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం నందవరం గ్రామంలో నిర్వహించిన చౌడేశ్వరీదేవి రథోత్సవం రమణీయంగా సాగింది. గ్రామ ఊరి వాకిలి వద్ద ప్రత్యేకంగా తయారు చేసిన తేరుబండిపై అమ్మవారి ఉత్సవమూర్తులకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ జి.కామేశ్వరమ్మ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య వందలాది మంది భక్తులు చౌడేశ్వరీదేవి నామస్మరణ చేస్తూ తేరుబండిని లాగుతూ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

- టీడీపీ జిల్లా లీగల్ సెల్‌అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్
- టీడీపీ కార్యాలయంలో లీగల్ సెల్ సదస్సు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 13: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేద్దామని టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన న్యాయవాదుల సదస్సులో టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్, బీజేపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు నర్సింహులు, జనసేన లీగల్ సెల్ అధ్యక్షుడు పీవీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జోన్ 5 ఇన్‌చార్జి బీద రవిచంద్రయాదవ్, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆకెపోగు ప్రభాకర్ హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేఈ జగదీష్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, మిత్ర పక్ష పార్టీల అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా న్యాయవాదులం పని చేస్తామని అన్నారు. ప్రతి అభ్యర్థి ఎంతో జాగ్రత్తగా ఎన్నికలను ఎదుర్కోవాలని, న్యాయవాదుల సలహా మేరకు నామినేషన్లు మొదలుకొని, కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. నామినేషన్ నుంచి బ్యాంక్ అకౌంట్ తెరవాలని, ఖర్చులకు సంబంధించి ఈ అకౌంట్ నుంచే డ్రా చేయాల్సి ఉంటుందని తెలిపారు. అది కూడా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు మాత్రమే ఖర్చు చేయాలని వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీటీ నాయుడు

అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలి

బీటీ నాయుడు, బీద రవిచంద్రయాదవ్, భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశానుసారంగా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపొంది మరోసారి ముఖ్యమంత్రి కావాలని జగన్మోహన్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలకు పూనుకుంటున్నారని ఆరోపించారు. ప్రతి పక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై ప్రతి చిన్న విషయంలో కేసులు పెట్టించి అడ్డు తొలగించుకోవాలనే కుటిలత్వంతో ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారుల ద్వారా ప్రతి పక్ష పార్టీ అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరణ చేయించి ఏకగ్రీవాలు చేసుకున్న విషయం విస్మరించవద్దని సూచించారు. అభ్యర్థులు ప్రచారం సందర్భంగా కూడా న్యాయవాదులను వెంట బెట్టుకోవాలని, ఎక్కడైనా పోలీసు కేసులు నమోదు చేస్తే వెంటనే తగిన న్యాయ సహాయాన్ని పొందే విలు ఉంటుందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి భూ వివాద చట్టం 2022 గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించే వీలు కూడా ఉంటుదని తెలిపారు. ప్రతి ఒక్క అభ్యర్థి ఒకటికి రెండు సార్లు నామినేషన్ పత్రాలను సరి చూసుకోవాలని సూచించారు. ఈ సదస్సుకు హాజరైన న్యాయవాదులు ఎన్నికల ప్రక్రియ సందర్భంగా అనుసరించ వలసిన అంశాలపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాశెట్టి శ్రీనివాసులు, చంద్రశేఖర్, సురేష్, వై.మల్లికార్జున నాగభూషన్ నాయుడు, మాదన్న, మోహన్‌రావు రవికాంత్, రషీద్, ఎస్‌ఏ సుభాన్ పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలో రూ.20 లక్షలు స్వాధీనం


నగదు స్వాధీనం చేసుకున్న సీఐ

పాణ్యం, ఏప్రిల్ 13: మండలంలోని తమ్మరాజుపల్లె పోలీసు చెక్‌పోస్టు వద్ద శనివారం జరిపిన వాహనాల తనిఖీలో రూ.20 లక్షలను పాణ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నల్లప్ప మాట్లాడుతూ కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఏపీ39ఎంయు6767 నెంబరు గల కారును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న కర్నూలు నగరం గౌతమీ నగర్‌కుచెందిన కల్లూరు రంగారెడ్డి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.20 లక్షలు నగదును గుర్తించినట్లు తెలిపారు. పెద్దమనుషుల సమక్షంలో పంచనామా చేసి నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అశోక్, బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణవేణి మహిళ అవయవాల దానం

ఓర్వకల్లు, ఏప్రిల్ 13: కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బిందు కృష్ణవేణి అనే మహిళ బ్రెయిన్‌కు సంబంధించి కొన్ని రోజుల క్రితం కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. చికిత్స పొందుతూ కృష్ణవేణి బ్రెయిన్ డెడ్ అయ్యారు. శనివారం కృష్ణవేణి అవయవాలను ఆమె భర్త అనుమతితో వైద్యులు సేకరించారు. కృష్ణవేణి హార్ట్, లివర్‌ను ప్రత్యేక అంబులెన్సులో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతిలోని పద్మావతి ఆసుపత్రికి తరలించారు. కిడ్నీని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్సుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అవయవాలను బాక్సుల్లో భద్రపరిచి వైద్యుల ఆధ్వర్యంలో తరలించారు. ఓర్వకల్లు ఎస్‌ఐ రాజారెడ్డి విమానాశ్రయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఓర్వకల్లు విమానాశ్రయంలోకి బాక్సుల్లో తరలిస్తున్న అవయవాలు

సూపర్‌సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 13: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు పేద, మధ్యతరగతి జీవితాల్లో వెలుగులు నింపుతాయని కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామంలో శనివారం కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి ఎంపీ అభ్యర్థి నాగరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. అంతేగాకుండా ప్రతి రైతుకు ఏడాదికి పెట్టుబడి ఖర్చు కింద రూ.20వేల ఆర్థిక సహాయం అందించే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ విధ్వంస పాలనను అంతమొందించాలని ఆయన కోరారు. పారిశ్రామికంగా ఏపీ పూర్తిగా వెనకబడిందని, చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేక పక్క రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకరావడంలో జగన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని నాగరాజు విమర్శించారు. రాష్ట్రంలో సర్పంచుల నిధులను సైతం నొక్కేసిన వైసీపీని ఇంటిని సాగనంపాలని, గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీకి ఒక్కసారి ఓటు వేసి అన్ని విధాలుగా తీవ్రంగా నష్టపోయారని, మరోసారి ఆ పొరపాటు చేయవద్దన్నారు. రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు వేసి తనతోపాటు కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు మాధవి, గ్రామ నాయకులు బీజేపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు

ఎట్టకేలకు కొండముచ్చుల పట్టివేత

డోన్(రూరల్), ఏప్రిల్ 13: డోన్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఐదు రోజులుగా ప్రజలపై దాడి చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్న రెండు కొండముచ్చులను అటవీశాఖ అధికారులు బంధించారు. డీఎఫ్‌ఓ శివశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సూర్యచంద్రరాజు, డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం కొండముచ్చుల కోసం గాలింపు చర్యలు చేపట్టింది. దీంతో శనివారం ఉదయం రెండు కొండముచ్చులను అటవీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం వాటికి వైద్యచికిత్సలు చేయించారు. ఆత్మకూరు అటవీ ప్రాంతంలో కొండముచ్చులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శివశంకర్, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.


పట్టుబడిన రెండు కొండముచ్చులు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బేతంచెర్ల, ఏప్రిల్ 13: చికిత్స పొందుతూ శనివారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. జమ్మలమడుగుకు చెందిన గోకారి (70)శుక్రవారం గుంటూరు నుంచి కాచిగూడ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్నాడు. కృష్ణమ్మ కోన రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. నంద్యాల రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో జేఎల్‌ఎం దుర్మరణం

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 13: మండలంలోని పులకుర్తి జేఎల్‌ఎం మహేష్‌ఆచారి (27) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మహేష్ శనివారం మధ్యాహ్నం ఓ పొలంలో ట్రాన్స్‌ఫార్మ్ వద్ద హెచ్‌జీ (హార్న్ గ్యాప్) ఫీజు వేయడానికి వెళ్లాడు. అందుకు లైన్ ఆఫ్ చేయించాడు. పని చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి పనులకు పూనుకోగా షాక్ గురై ఒక్కసారిగా కింద కింద పడ్డాడు. నిర్ఘాంతపోయిన పొలం రైతు ఇతరుల సాయంతో బైక్‌పై ఆసుపత్రికి తరలించాడు. మార్గమధ్యంలో 108 వాహనం రాగా అందులో తరలించారు. బాధితుడిని గూడూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విద్యుదాఘాతానికి గురయ్యాడా లేదా అనేది తెలుస్తుందని ఏఈ ఇస్మాయిల్ తెలిపారు. నెల రోజుల క్రితమే మహేష్ తండ్రి మల్లికార్జున కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. అంతలోనే పెద్దదిక్కుగా ఉన్న ఒక్కగానొక్క కుమా రుడు మహేష్ కూడా మృతి చెందడంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. మృతునికి తల్లి శకుంతలమ్మ, భార్య రాధిక, ఏడాదిన్నర పాప ఉన్నారు.

వైసీపీ జెండాలు, టీషర్టులు స్వాధీనం
వాహనం సీజ్


స్వాధీనం చేసుకున్న అనుమతి లేని వాహనం

ఆలూరు, ఏప్రిల్ 13: ఆలూరు-ఆదోని రోడ్డు సమీపంలోని బెల్లిగుండు ఆంజనేయ స్వామి క్రాస్ వద్ద అనుమతి లేకుండా వైసీపీ జెండాలు, బ్యాడ్జీలు, కండువాలు, కరపత్రాలు, స్టిక్కర్స్, బ్యాగ్‌లు, టీషర్టులను శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ అధికారుల ఉత్తర్వుల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం డిప్యూటీ తహసీల్దార్, బీ బ్రహ్మయ్య, ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు సిబ్బంది కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ 39ఎంబీ, 6819 నెంబర్ గల కారులో లభించాయి. కారును సీజ్ చేసిన అధికారులు, కారు ఓనర్ గుర్నాథరెడ్డి, డ్రైవర్ బొంటుపల్లి సురేష్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలు పాటించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దేవనకొండ, ఏప్రిల్ 13: చికిత్స పొందుతూ శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. మండలంలోని కె.వెంకటాపురానికి చెందిన గొల్ల మోహన్ (27 కొత్తపేట గ్రామానికి చెందిన సుజాతను నాలుగేళ్ల కిందట పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లో లిఫ్టులో పని చేస్తూ భార్యా భర్తలిద్దరూ జీవనం సాగించేవారు. వారం రోజుల కిందట కొత్తపేటకు వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం మోహన్ పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి తిమ్మప్ప ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు. భార్య సుజాత ప్రస్తుతం గర్భిణికాగా వీరికి మూడేళ్లలోపు చిన్నారులు ఇద్దరు ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు రాష్ట్రానికే శ్రీరామరక్ష

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత


ఎన్నికల ప్రచారంలో విజయ కేతనం చూపుతున్న టీడీపీ పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నా యుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు రాష్ట్రానికే శ్రీరామరక్షగా నిలు స్తాయని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు మండలం పెద్ద కొట్టాల, చిన్న కొట్టాల, రేమడూరు, పుసులూరు, బొల్లవరం గ్రామాల్లో పర్యటించారు. ఉమ్మడి మేని ఫెస్టోలోని బాబు షూరిటీ - భవిషత్తు గ్యారెంటీ, సూపర్-6 పథకాలను గౌరు చరిత ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నిక ల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభంజనం సృష్టిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో చిన్న కొట్టాల గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు సోమన్న, దుబ్బన్న, గోవిందులతోపాటూ 50 కుటుంబాలు గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజినేయులు, మాజీ ఎంపీపీ వాకటి మాధవి, మదేశ్, తడకనపల్లె సర్పంచ్ సహరబీ, పాణ్యం టీడీపీ అధ్యక్షుడు జవాజి గంగాధర్ గౌడ్, పెద్ద కొట్టాల మురళీరెడ్డి, రంగారెడ్డి, ఖాసిం, అక్బర్ బాషా, రేమడూరు రామనాయుడు, పుల్లన్న, బజారన్న, బొల్లారం మస్తాన్ నాయుడు, విజయ్, పుసులూరు కృష్ణ, రాముడు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌గౌడ్, బీజేపీ నాయకుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

13 రోజుల తర్వాత శవం వెలికితీత

- బీమా సొమ్ము కోసం ఫారూక్ డ్రామా అని అనుమానాలు
- వ్యక్తి అదృశ్యం.. అగ్ని ప్రమాదం కేసులపై పోలీసుల విచారణ
- శెట్టి ప్రతాప్ మృతదేహం బంధువులకు అప్పగింత

పాములపాడు, ఏప్రిల్ 13: మిస్టరీగా మారిన ఓ ఘటనకు సంబంధించి పాములపాడు పోలీసులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. హత్య చేసి ప్రమాదవశాత్తు జరిగినట్లుగా చిత్రీకరించిన ఓ కేసుకు సంబంధించి పోలీసులు వేగవంతమైన విచారణ చేపడుతున్నారు. అందులో భాగంగానే శనివారం పాములపాడులోని ఖబరస్థాన్‌లో ఇటీవల ఖననం జరిగిన మృతదేహానికి 13 రోజుల తర్వాత పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మొదటి నుంచి ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకెళితే... ఈ నెల ఒకటో తేదీన పాములపాడులోని ఫారూక్ ట్రేడర్స్ యజమాని ఫారూక్‌బాషా షాపులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీంతో ఫారూక్ బాషా కుమారుడు అక్బర్‌బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అక్కడ దొరికిన ఆనవాళ్ల ప్రకారం దుకాణ యజమాని ఫారూక్ బాషాగా కుటుంబ సభ్యులు గుర్తించి ముస్లిం సంప్రదాయ రీతిలో ఖననం చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అయితే అదే రోజు మండలంలోని చెలిమిల్లకు చెందిన శెట్టి ప్రతాప్ కనిపించడం లేదంటూ భార్య స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సవాల్‌గా తీసుకుని విచారణ వేగవంతం చేశారు. తాగుడుకు బానిసైన శెట్టి ప్రతాప్ డబ్బుల కోసం ఫారూక్ దుకాణంలో పనిచేసేవాడని సమాచారం. ప్రమాదవశాత్తు ఫారూక్ అనే వ్యక్తి మంటల్లో కాలిపోయి గుర్తు పట్టనంత విధంగా ఉండటం, ప్రతాప్ కనిపించకకుండా పోవడంతో పోలీసులకు అనుమానం వచ్చి అన్ని కోణాల్లో విచారణ చేశారు. నిజానికి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారి ఫారూక్ బాషా అప్పుల్లో కూరుకుపోయాడు. తాను చనిపోయినట్లు జనాలను నమ్మిస్తే... అప్పులు మాఫీ కావడంతో పాటు తనపై ఉన్న బీమా డబ్బులు కుటుంబ సభ్యులకు వస్తాయని భావించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అగ్ని ప్రమాదంలో తాను మృతి చెందినట్లుగా ఓ నాటకానికి తెరలేపాడు. చివరకు శెట్టి ప్రతాప్ అదృశ్యం కేసు, అగ్ని ప్రమాదం కేసులు ఒకే రోజు నమోదు కావడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. విచారణ చేపట్టగా చివరకు మృతి చెందింది ఫారూక్ బాషా కాదని, శెట్టి ప్రతాప్‌ది అని తేలింది. బతికే ఉన్నా చనిపోయినట్లు ఆడిన ఫారూక్ డ్రామా ఎట్టకేలకు బయటపడింది.


మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ఆ మృతదేహం శెట్టి ప్రతాప్‌దే...

శెట్టి ప్రతాప్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తుండగా అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఎవరన్న దానిపై ఆరా తీశారు. ఆ శవంపై ఉన్న దుస్తుల ఆధారంగా శెట్టి ప్రతాప్ కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో శనివారం నంద్యాల ఏఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ, శ్రీనివాసరావు, సీఐ నాగభూషణం ఎస్‌ఐలు, తహసీల్దార్ పఠాన్ బాబు, ఆధ్వర్యంలో ఖబరస్థాన్‌లోని మృతదేహాన్ని వెలికి తీయించి శెట్టి ప్రతాప్ తల్లిదండ్రులు, భార్యకు అప్పగించారు.

పరారీలో ఫారూక్ బాషా

అగ్ని ప్రమాదం జరిగినప్పటి నుంచి ఫారూక్ బాషా పరారీలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతడిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. శెట్టి ప్రతాప్‌పై పెట్రోల్ పోసి ఫారూక్ బాషా హత్య చేశాడని స్థానిక రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

మాటలతో మభ్యపెట్టడంలో శిల్పా దిట్ట

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి



మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖరరెడ్డి



టీడీపీలో చేరిన నాయకులతో బుడ్డా

శ్రీశైలం, ఏప్రిల్ 13: ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాటలతో మభ్యపెట్టి ప్రజలను మోసం చేయడంలో దిట్ట అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి విమర్శించారు. శనివారం శ్రీశైల ముఖద్వారం వద్ద నుంచి బుడ్డా రాజశేఖరరెడ్డికి టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు ఘనస్వాగతం పలికి భారీ బైక్ ర్యాలీగా శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని మహిషాసురమర్దిని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతర శ్రీగిరి కాలనీలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్నారు. బత్తుల చిన్నగాలయ్య కుమారుడు దుర్గాప్రసాద్ తన అనుచర వర్గం ఐతా మార్కండేయులు, చిక్కా వెంకటేష్, అరవపల్లి సత్యనారాయణ, విశ్వనాథం, బోయ మురళితో పాటు సుమారు 300 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బుడ్డా మాట్లాడుతూ అక్రమార్జనతో నియోజకవర్గ ప్రజలను విస్మరించిన శిల్పాకు ఓటుతోనే ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. న్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు సుస్థిర పరిపాలన అందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి శిల్పా చక్రపాణి గెలిచారన్నారు. ఆయన మాటలు నమ్మి భారీ మెజారిటీతో గెలిపిస్తే గ్రామ అభివృద్ధి, ప్రజల కనీస అవసరాలను విస్మరించి తన వ్యాపారాలతో అక్రమార్జనకు పాల్పడ్డారని బుడ్డా ఆరోపించారు. దేవస్థానంలో తన కార్తికేయ ఏజెన్సీని అడ్డం పెట్టుకుని సిబ్బందికి తక్కువ వేతనాలు ఇస్తూ ఈ ఐదేళ్లలో రూ. 60 కోట్ల రూపాయలను అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. అదేవిధంగా వ్యాపారులపై వేలకువేలు అద్దె భారాలు మోపి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని శిల్పా చక్రపాణిరెడ్డి సేవాసదన్ పేరుతో శిద్దరామప్ప కాంప్లెక్స్‌లో మూడు దుకాణాలను తీసుకుని చదరపు అడుగుకు రూ.10 చొప్పున చెల్లించడం దుర్మార్గమన్నారు. ఆ దుకాణాలను వైసీపీ కార్యాలయంగా మార్చుకుని అక్రమంగా చలామని అవుతుంటే దేవస్థానం అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. శ్రీశైలంలో పేదలకు ఇళ్లు కట్టించి తాళాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రజలు చక్రపాణిరెడ్డిని నిలదీయాలని సూచించారు. చక్రపాణిరెడ్డిలాగా నేను తప్పుడు హామీలు ఇవ్వనని బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. తాను ఎన్నికల్లో గెలిస్తే శ్రీశైలంలో నివసించేందుకు ఇంటి సౌకర్యాలు, రహదారులు, విద్యుత్ దీపాలు, ఇంటికి మీటర్లు మంజూరు చేయిస్తానని బుడ్డా రాజశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో ప్రజల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని పార్టీ మారిన నాయకులు కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. శిల్పా చక్రపాణిరెడ్డిని నిమ్మ వెంట వెళితే మోపోయామని తెలుసుకోవడానికి ఐదేళ్లు పట్టిందన్నారు.

'ఇంటాక్ సేవలు అమోఘం'



మహానంది జల సంపద నివేదికలను అందిస్తున్న ఇంటాక్ సంస్థ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి, తదితరులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 13: పురాతన ఆలయాల చరిత్రను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి ప్రాచుర్యాన్ని నలు దిశలుగా వ్యాప్తిచెందేలా చేస్తున్న ఇంటాక్ సంస్థ కృషి అమోఘమని మహానంది అలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం నంద్యాల దామోదర్‌రెడ్డి యోగా కేంద్రంలో ఇంటాక్ సంస్థ సభ్యుల సమావేశం ఇంటాక్ నంద్యాల జిల్లా చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహానందిలోని అద్భుత జలం శాంపిల్స్ నివేదికలను ఆలయ ఈవోకు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈవో మాట్లాడుతూ ఇంటాక్ సంస్థ నంద్యాల జిల్లాలోని అహోబిళం పుణ్యక్షేత్రంలో ప్రతిఏడాది జరిగే పారువేట ఉత్సవాన్ని ప్రభుత్వ ఉత్సవంగా (పండుగగా)గుర్తింపు తీసుకురావడానికి ఎంతో కృషి చేసిందన్నారు. అహోబిలం ఆలయ అబివృద్ధి కోసం రూ.25కోట్లు ప్రభుత్వం విడుదలచేస్తూ జీవో విడుదల చేసిందన్నారు. అలాగే మహానంది ఆలయానికి కూడా నలుదిశలా వ్యాప్తి చెందింప చేసేందుకు సభ్యులు ఎంతో కృషిచేస్తున్నారని చెప్పారు. మన సంస్కృతీ సాంప్రదాయాలను భావితరాల వారికి అందించాలంటే ఇంటాక్ సంస్థలో ఎక్కువ మంది సభ్యత్వం తీసుకోవాలని కోకన్వీనర్ సేతు రామన్ కోరారు. కార్యక్రమంలో మహానంది ఆలయ వేద పండితులు అర్జున శర్మ, రవిశంకరఅవధాని, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ కిషోర్‌కుమార్, దామోదర్ రెడ్డి, గోళ్లసుదర్శనం, మారం శేషయ్య, అంజనేయులు, డాక్టర్ కార్తీక తదితరులు పాల్గొన్నారు.

'బహుజనులు రాజ్యాధికారం సాధించాలి'



నివాళి అర్పిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 13: బీపీ మండల్ స్ఫూర్తితో బహుజనులు రాజ్యాధికార దిశగా పయనించాలని సమాజ్‌వాదీ పార్టీ రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ పాండురంగ యాదవ్, జిల్లా అధ్యక్షుడు పెరుగు శివకుమార్ పిలుపునిచ్చారు. బీసీల రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వర్ ప్రసాద్‌మండల్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం నంద్యాల లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని నియోజకవర్గాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: రాజ్యాధికారం దిశగా బీసీలు పయనించాలని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు, నియోజకవర్గం గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వీరన్న పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం బీహార్ మాజీ ముఖ్యమంత్రి బాబు బింధేశ్వరీ ప్రసాద్ మండల్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరంవారు మాట్లాడుతూ.. బీసీ మండల్ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా పనిచేసి బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్లను కల్పించినట్లు గుర్తుచేశారు. బహుజన నేతల గురించి విగ్రహాలను ఏర్పాటు చేసి భావితరాలకు తెలియజేసేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ క్యాక్రమంలో ఆ సంఘం నాయకులు పెద్దనాగన్న, బొల్లు ప్రసాద్ యాదవ్, శ్రీనివాసులు, శివ, నాయక్ తదితరులు ఉన్నారు.

'అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం'



విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డా.నాగన్న

కొత్తపల్లి, ఏప్రిల్ 13: డా.బీఆర్ అంబేడ్కర్, పూలే ఆశయాలను కొనసాగిద్దామని సత్యశోదక్ సమాఖ్య అధ్యక్షుడు, ఆత్మకూరు ప్రముఖ వైద్యుడు డా.నాగన్న పిలుపునిచ్చారు. కొత్తపల్లిలోని కేజీబీవీలో అంబేడ్కర్, పూలేలకు సంబంధించి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వైద్యుడునాగన్న ఆధ్వర్యంలో శనివారం నగదు బహుమతిని అందజేశారు. డా.నాగన్న మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ జయంతులను పురస్కరించుకుని విద్యార్థులకు అంబేడ్కర్ బాల్యం, విద్యాభ్యాసం, భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలను ఈ నెల 10న నిర్వహించామని చెప్పారు. విజేతలకు అంబేడ్కర్ జీవిత చరిత్ర, బౌద్ధ ధర్మ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆ పాఠశాల ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువలతో నాగన్నను సన్మానించారు. అంబేడ్కర్ ధర్మ ప్రచారకులు సీలం శేషగిరిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీదీపా కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన శ్రీదీపా కళాశాల విద్యార్థులు

ఆత్మకూరు, ఏప్రిల్ 13: ఆత్మకూరు పట్టణంలోని శ్రీదీపా కళాశాల విద్యార్థినీలు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నిరోషా 900మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవగా, గిరిజాదేవీ 890 జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా ఫస్ట్ ఇయర్ ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్ కోర్సు ఫలితాల్లో బీ.పద్మావతి 448/500, ఫర్హానా 430/500 మార్కులతో స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. అలాగే వెటర్నరీ కోర్సు నందు రాధ 446/500, చంద్రకళ 446/500 జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలువగా, సుమయ సుల్తానా 411/500 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఈసందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీలను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

ఆర్జీఎం విద్యార్థులు

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 13: ఇంటర్మీడియట్ ఫలితాలలో ఆర్జీఎం విద్యాసంస్థలకు చెందినది నంద్యాల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ అక్తర్ హుస్సేన్ శనివారం తెలిపారు. సీనియర్ ఎంపీసీలో నాగశివకుమార్ 984 మార్కులు, సీనియర్ బైపీసీలో షైనీ 984 మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీలో మధులిక 463 మార్కులు, జూనియర్ బైపీసీలో సారిక 423మార్కులతో అగ్రస్థానంలో నిలిచారన్నారు. ఇంటర్ ఫస్టియర్, సెకండ్ ఇయర్‌లో 91శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. విద్యార్థులను అధ్యాపక బృందాన్ని ఆర్జీయం విద్యాసంస్థల చైర్మన్ మిద్దె శాంతి రాముడు, ఎండీ మిద్దె శివరామ్ అభినందించారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై ఫిర్యాదు

వెలుగోడు, ఏప్రిల్ 13: వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో ఉపాధి హామీపనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ఆ అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామ సర్పంచ్ అంబాల నాగలక్ష్మమ్మ తెలిపారు. గ్రామంలో జరుగుతున్న పనుల్లో పనికి వెళ్లని వారికి సైతం అటెండెన్స్ వేస్తున్నారని, మస్టర్‌లో సంతకాలు లేకుండానే పనులు చేస్తున్నారని చెప్పారు. కొన్ని మస్టర్లలో ఒకటి రెండు తప్ప సంతకాలు లేవని పలు సమస్యలపై ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే గ్రామానికి చెందిన ఒక పార్టీకీ చెందిన వారికే మద్దతు పలుకుతున్నారని ఆమె ఆరోపించారు. ఉపాధి పనుల్లో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ విషయంపై ఏపీవో మల్లికార్జునను వివరణ కోరగా సర్పంచ్ ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, తాను కూడా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

మాంసం పంపకంలో ఘర్షణ.. 18 మందిపై కేసు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 13: మండలంలోని మండ్లెం గ్రామంలో శుక్ర వారం కర్రెమ్మ దేవత ఉత్సవాల సందర్భంగా మాంసం పంచుకునే విష యంలో ఘర్షణ జరిగిందని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇరు వర్గాలు కట్టెలు, రాళ్లతో దాడిచేసుకోవడంతో ఏడుగురికి గాయాలుకాగా, నందికొ ట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువర్గాలు శనివారం ఫిర్యాదు చేసుకోవడంతో 18 మందిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం స్వాధీనం

మిడుతూరు, ఏప్రిల్ 13: అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. మండలంలోని తలముడిపి గ్రామానికి చెందిన రంగస్వామి, మద్దిలేటి అక్రమంగా మద్యం విక్రయిస్తుంగా 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 13: ఆత్మకూరు పట్టణ శివార్లలోని గీతా భవన్ వద్ద కేజీ రోడ్డుపై ఓ కారు బైకును ఢీకొన్న సంఘటనలో లింగస్వామి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. శనివారం ఎస్ఐ నారాయణ రెడ్డి తెలిపిన వివరాలివీ.. ఆత్మకూరు మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన లింగస్వామి అనే వ్యక్తి పట్టణ శివార్లలోని గీతా భవన్ హోటల్ ప్రాంతంలో బైక్‌లో పెట్రోల్ పోయించుకుని తిరిగి కేజీ రోడ్డు ఆవలి వైపు ఉన్న టీస్టాల్ కోసం బైక్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా ఓ కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో బైక్ నుంచి కింద పడి లింగస్వామికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు సమాచారం ఇవ్వ డంతో 108లో క్షతగాత్రున్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ లింగస్వామి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా వరంగల్ జిల్లా కు చెందిన ఆ కారు యజమానులు అహోబిళం నుంచి శ్రీశైలం వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

విలువల్లేని పార్టీలో ఉండలేకే బయటికొచ్చా: ఆర్థర్

కొత్తపల్లి, ఏప్రిల్ 13: విలువల్లేని వైసీపీలో ఉండలేకే ఆ పార్టీకి రాజీనామా చేసి బయటికొచ్చానని నందికొట్కూరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి తోగూరు ఆర్థర్ అన్నారు. శనివారం ఆయన కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమేశ్వరుని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జానాలగూడెం, బలపాలతిప్ప, కపిలేశ్వరం, పాత మాడుగుల గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీలోని పెత్తందారుల కబంధహస్తాల మధ్య ఉండలేకనే బయటకు వచ్చానన్నారు.

'అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయండి'

పాణ్యం, ఏప్రిల్ 13: డాక్టర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలు జయప్రదం చేయాలని మాలమహానాడు నాయకులు దత్తు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద నిర్వహించే అంబేడ్కర్ జయంతి ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు జిల్లా కలెక్టరు ప్రత్యేక స్థలం కేటాయించి ప్రభుత్వ ఖర్చులతో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

వైసీపీకి గుణపాఠం తప్పదు: మాండ్ర



టీ షర్టులను విడుదల చేస్తున్న మాండ్ర, టీడీపీ నాయకులు

నందికొట్కూరు ఏప్రిల్ 13: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని, టీడీపీని ఆశీర్వదిస్తే నియోజకవర్గంలోని తాగు, సాగునీటి సమస్యలకు శాశ్విత పరిష్కారం చూపుతామని టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శనివారం అల్లూరు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ టీషర్టులు, స్టిక్కర్లు, టోపీలు, కండువాలు, బ్యాడ్జీలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అరాచక పాలన సాగుతోందని, ఈ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని అన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని చెప్పిన సీఎం జగన్.. మద్యం ఏరులై పారే విధంగా చేశారన్నారు. మంత్రులు, అయన అనుచరులు కీలకపాత్ర పోషించారని ఆరోపించారు. న్నారు. క్వాలిటీ లేని మద్యం అందజేస్తూ జగన్మోహన్‌రెడ్డి వేల కోట్ల రూపాయాలను సంపాదిస్తున్నారే తప్ప.. రాష్ట్రానికి ఆదాయం అంతంత మాత్రంగానే ఉందని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేసిన అవినీతి, అవక తవకలకు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఈనెల 15వ తేదీన సాయంత్రం 4 గంటలకు నందమూరి బాలకృష్ణ నందికొట్కూరు పట్టణంలో రోడ్‌షో నిర్వహిస్తారన్నారు. కొత్తబస్టాండు నుంచి పటేల్ సెంటర్ వరకు అయన రోడ్డు షో నిర్వహిస్తారని, నియోజకవర్గంలోని బాలకృష్ణ అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 22న ఉదయం 11 గంటలకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య నామినేషన్ దాఖలు చేస్తారని చెప్పారు. పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండ్లెం మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, గిరీశ్వర్‌రెడ్డి, జమీల్, రసూల్, అయ్యన్న, బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు తిమ్మారెడ్డి, పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు: జయసూర్య



గువ్వలకుంట్లలో మాట్లాడుతున్న గిత్తా జయసూర్య

కొత్తపల్లి, ఏప్రిల్ 13: టీడీపీతో అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య పిలుపునిచ్చారు. శనివారం రాత్రి గువ్వలకుంట్ల గ్రామంలో మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, స్థానిక టీడీపీ నాయకులు పోతుల నారాయణ, జానకి రాముడు ఆధ్వర్యంలో జయహో బీసీ సభను నిర్వహించారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణమ్మ, వెంకట్రాముడు, శేషన్న, బలరాముడు, తెలుగు పెద్ద సన్నయ్య, సుంకన్న, పోత శివనారాయణ, మండలంలోని ఆయా గ్రామాల టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాములపాడు: గత టీడీపీ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని నందికొట్కూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య అన్నారు. శనివారం మండలం లోని మిట్టకందాల గ్రామంలో టీడీపీ నాయకులు హరిప్రసాద్, మందడి మల్లికార్జున ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు హరినాథ రెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, మధుక్రిష్ణ. హఫీజ్, కరీంబాషా, కృష్ణ పాల్గొన్నారు.

● బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేసిన ఘనత ఒక్క టీడీపీకే దక్కిందని నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, మాండ్ర లింగారెడ్డి అన్నారు. మద్దూరులో స్థానిక టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవం



బాపనంతాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం



పాత ముచ్చుమర్రిలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

పగిడ్యాల, ఏప్రిల్ 13: మండలంలోని పాతముచ్చుమర్రి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, వాల్మీకి మహర్షి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలను శనివారం గ్రామస్థులు వైభవంగా జరుపుకొన్నారు. పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా వివిధ రకాల పూజలు, హోమాలను నిర్వహించారు. ఉదయం పూజారులు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, కక్ష్యజ్వాలా బలిహారణములు, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు హాజరై పూజలు చేశారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం బాపనంతాపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గణపతి, శివ, మానసా దేవి సహిత నందీశ్వర స్వాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గత నాలుగు రోజుల పాటు ఆయా దేవతామూర్తులకు పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శనివారం ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కల్యాణమూర్తులుగా అలంకరించి, వేదమంత్రోచ్ఛరణల నడుమ గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, కన్యాదానం, మహా సంకల్పం, శిరస్సున జీలకర బెల్లం, మాంగళ్యధారణ, అక్షతారోహణం, మహా మంగళ హారతితో కల్యాణ వేడుకలను దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు చుట్టుపక్కల ప్రాంతాలనుంచి అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. విచ్చేసిన భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిక



పి.లింగాపురం గ్రామంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 13: మండలంలోని పి.లింగాపురం గ్రామంలో వైసీపీ నాయకులు శనివారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, వెంకటరమణనాయుడు, మురళీధర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, అంకన్న, చక్రవర్తితోపాటు 50 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి బైరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తుం డటంతో టీడీపీలో చేరినట్లు తెలిపారు.

గౌరు సమక్షంలో ముస్లింలు..



టీడీపీలో చేరిన బిలకలగూడురు గ్రామ ముస్లింలు

గడివేముల, ఏప్రిల్ 13: మండలంలోని బిలకలగూడురు గ్రామానికి చెందిన 30 కుటుంబాల ముస్లింలు శనివారం టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డి సమక్షంలో ఆయన నివాసం వద్ద గడివేముల టీడీపీ మండల అధ్యక్షుడు సత్యంరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. గౌరు వెంకట్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన అనంతరం మహమ్మద్, రెహమ్, మౌలాన, ఇసాక్, మహబూబ్, ఫరూక్, ముజాహిద్, సల్మాన్‌లు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ముస్లింలు అభి వృద్ధికి నోచుకోలేదని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలు అభి వృద్ధి చెందేందుకు చంద్రబాబు అనేక పథకాలను తీసుకొచ్చారని అన్నారు.

వెలుగోడు నాయకులు..

వెలుగోడు, ఏప్రిల్ 13: వెలుగోడు పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు మిద్దె రెహమాన్, పోలూరు ఖలీల్, వారి అనుచరులతో శనివారం టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు అన్నారపు శేషి రెడ్డి, మల్ల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి మండల నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మోమిన్ రసూల్, హిదాయత్, ఖలీల్, అమీర్ అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి'



మస్తాన్‌బాబాతో చర్చిస్తున్న బైరెడ్డి శబరి, భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 13: టీడీపీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శ బరి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి సూచించారు. గత కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న నంద్యాల టీడీపీ మైనారిటీ కార్యదర్శి షేక్ మస్తాన్‌బాబాను ఆయన ఇంట్లో కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారు చర్చించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాబువలీ, టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి జేవీ మనోహర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

'వలంటీర్లతో వెట్టిచాకిరి దారుణం'

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 13: రాష్ట్రంలో వైసీపీ పాలనలో వలంటీర్లతో వెట్టి చాకిరీ చేయుంచుకొని తక్కువ గౌరవవేతనం అందించడం దారుణమని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగనే వారికి రూ.10వేల గౌరవవేతనం అందించనున్నట్లు నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డా. బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాలలోని టీడీపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ నాయకుల మాటలు విని వలంటీర్లు రాజీనామా చేయొద్దని సూచించారు. ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తల్లగా పనిచేయించేందుకు, ఎన్నికల్లో ఏజెంట్లుగా నియమించుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగల జీవితాలతో వైసీపీ ఆడుకుందని, ఐదేళ్ల పాలనలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ ఎక్కడ? అని ఆమె ప్రశ్నించారు. వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదని నిలదీశారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి రెండురోజులుగా నంద్యాలలో క్లస్టర్ సమావేశాలు పెట్టి వలంటీర్లు రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.

బొజ్జాను కలిసిన ఫరూక్



దశరథరామిరెడ్డితో మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 13: రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డిని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ శనివారం కలిశారు. ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు.

'నీటి సమస్య పరిష్కారానికి కృషి'

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 13: నంద్యాలలోని పొన్నాపురం కాలనీలో ఏర్పడ్డ మంచి నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. శనివారం నంద్యాలలోని 19,25 వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వార్డుల్లోని సమస్యలను ఫిరోజ్ అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగనే చేపట్టే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వార్డులోని సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

పగిడ్యాల, ఏప్రిల్ 13: వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ కులాలకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని టీడీపీ నాయకుడు మాండ్ర లింగారెడ్డి అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో శనివారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు జీవనోపాధి లేక పట్టణాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య స్థానికుడని, నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై అవగాహన ఉందని, అలాంటి వ్యక్తిని ఆదరించాలని అన్నారు. టీడీపీ మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు లోకానందరెడ్డి, చాకలి రామస్వామి, శ్రీనాథ్‌రెడ్డి, చాపల విజేయుడు, ఫరూక్ బాషా, ఒగిలి శ్రీనివాసులు, కుమార్, వెంకటేశ్వరు తదితరులు ఉన్నారు.

చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న బైరెడ్డి శబరి


ఆలయ ఆవరణలో టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 13: నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి నందవరం చౌడేశ్వరిదేవిని దర్శించుకున్నారు. జ్యోతి ఉత్సవం సందర్భంగా చౌడేశ్వరిదేవిని దర్శించుకునేందుకు శనివారం ఆమె నందవరం వచ్చారు. నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు బైరెడ్డి శబరికి స్వాగతం పలికారు. అనంతరం ఆమె చౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. బైరెడ్డి శబరి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని గ్రామ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పీవీ నాగార్జునరెడ్డి, బోయ వెంగన్న, వుశేన్‌వలి, బాలి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ


మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

బేతంచెర్ల, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని ముద్దవరం గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ వైసీపీ ఓ వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చిందని, మిగతా వారిని అణగదొక్కిందని అన్నారు. వైసీపీ పాలనలో బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు పెద్దపీట వేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని ఆమె పిలుపునిచ్చారు. డోన్‌లో టీడీపీ జెండా ఎగురవేయాలని ఆమె ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, బీసీ సెల్ నాయకుడు ఎర్రమల నాయుడు, ఆర్. బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, మండల సమన్వయకర్త చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి, జావాజి వెంకటేశ్వర్లు, నారాయణస్వామి, మేకల నాగరాజు, రూబెన్, టైలర్ రాముడు, లోకేశ్‌గౌడు, జనసేన నాయకులు చల్లా మద్దిలేటి స్వామి, గ్రామ నాయకులు రాధాకృష్ణ, కైలాస్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో 76 డెంగీ కేసులు

మలేరియా అధికారి కామేశ్వరరావు


రిపోర్టులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 13: జిల్లా వ్యాప్తంగా 76 డెంగీ కేసులు ఉన్నట్లు జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు తెలిపారు. శనివారం ఉయ్యాలవాడలోని ఎస్సీ కాలనీలో డెంగీ అనుమానిత కేసులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో 4 డెంగీ అనుమానిత కేసులు ఉన్నాయని, కానీ కొన్ని రిపోర్టుల్లో అవి డెంగీ కేసులు కాదని రిపోర్టుల్లో నిర్ధారణ అయ్యిందన్నారు. ఇటీవల కాలనీలో మృతి చెందిన బాలుడు డెంగ్యీ వల్ల చనిపోలేదని, మెదడు సంబంధిత వ్యాధితో మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కాలనీలోని మురుగు కాలువలను శుభ్రం చేయించి, నీరు నిల్వ ఉన్నచోట వేస్ట్ ఆయిల్ చల్లించి పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విశ్వనాథ్, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, రామచంద్రుడు, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

'డెంగీతో అప్రమత్తంగా ఉండాలి'

నంద్యాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు డెంగీతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సూచించారు. ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామంలో ఓ బాలికకు డెంగీ వ్యాధి లక్షణాలు నిర్ధారణ కావడంతో వైద్య సిబ్బంది శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలకు మందులు, మాత్రలు పంపిణీ చేశారు.

వైసీపీని ఇంటికి సాగనంపండి

సంజామల, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని టీడీపీ నాయకురాలు కమలపురి సర్పంచ్ విజయమ్మ పిలుపునిచ్చారు. శనివారం సంజామలలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి విజయం కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. శబరి సమీప బంధువులు, బి సూర్యనారాయణ రెడ్డి, సరోజిని, గీతా వినయ్‌రెడ్డితో కలిసి జయమ్మ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి, అరాచకాలతో కూరుకుపోయిన వెసీపీకి, ఆ పార్టీ నాయకులకు రోజులు దగ్గర పడాయన్నారు. ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోని నాయకులకు ఓటు అడిగే హక్కులేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మల్కిహుస్సేన్, రామకృష్ణ, సుధాకర్, మద్దిలేటి, పెద్దపుల్లయ్య, దాట్ల చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌బాష, మాధవ, రవి, వాహబ్, ఇద్రుస్‌బాషా, గణపం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి'

నంద్యాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ యువ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి కోరారు. మండలంలోని బత్తలూరు గ్రామంలో శనివారం ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని చేపట్టి మాజీ సీఎం చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

అమరులకు ఘన నివాళి

నంద్యాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జలియన్ వాలాబాగ్ దురాగతానికి బలైన అమరవీరులకు ఘన నివాళి ప్రకటించినట్లు నంద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోని అరుణోదయ పాఠశాలలో శనివారం అమర వీరులకు నివాళి అర్పించారు. పాఠశాల హెచ్‌ఎం ఇమామ్‌హుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు'

చాగలమర్రి, ఏప్రిల్ 13: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమణయ్య సూచించారు. శనివారం టోల్ ప్లాజా చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అదరగొడుతున్న ఎండలు

బెంబేలెత్తిపోతున్న జనాలు


జనసంచారం లేని వీధులు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 13: ఎండలు అందరగొడుతున్నాయి. దీంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంట్లో ఉండలేకపో తున్నాం.. బయట తిరగలేకపోతున్నామని వాపోతున్నారు. ఏసీలు, కూలర్లు ఉన్నప్పటికీ కాసేపటికీ ఎండల తీవ్రతకు అవి తట్టుకోవడం లేదు. బయట ఎక్కడ చెట్టు కనిపిస్తే దాని నీడకు పరుగులు తీసే పరిస్థితి నెలకొంది. ఏప్రిల్ ప్రారంభంలోనే 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు ఉంటే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కొలిమిగుండ్ల మైనింగ్ ప్రాంతం కావడంతో ఎండవేడిమితో పాటు, వడగాలులు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 8 గంటల నుంచే సూర్య భగవానుడు భగభగ మండిపోతున్నాడు. సాయంత్రం 5గంటలు దాటిన ఎండ వేడిమి తగ్గటం లేదు. దీంతో ప్రధాన రహదారులు, వీధులు జన సంచారం లేక వెలవెలబోతున్నాయి. కర్నూలు, కడప అనంతపురం జిల్లాల సరిహద్దు బస్టాండ్ జన సంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తోంది. ఎండ వేడి కారణంగా చిన్నపిల్లలు చర్మ వ్యాధులకు గురవుతున్నారు.


నిర్మానుష్యంగా ఆర్టీసీ బస్టాండ్

బుగ్గనకు భారీ షాక్

టీడీపీలో చేరిన కమలాపురం వైసీపీ సర్పంచ్
మరో 300 మంది వైసీపీ కార్యకర్తలు కూడా..

డోన్, ఏప్రిల్ 13: డోన్ మండలంలో మంత్రి బుగ్గనకు భారీ షాక్ తగిలింది. వరుస దెబ్బలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బుగ్గనకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. కమలాపురం వైసీపీ సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి శనివారం టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పట్టణంలోని తన నివాసంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనతో పాటు సోమశేఖర్ రెడ్డి, సూర్యప్రకాష్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, మౌలాలి, సునీల్, మధు, రఘురామిరెడ్డి, రమేష్ రెడ్డి, తిమ్మయ్య, శేఖర్‌గౌడులతో పాటు మరో 300 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా టీడీపీ కండువాలు వేసి కోట్ల పార్టీలోకి ఆహ్వానించారు. కోట్ల మాట్లాడుతూ అక్రమ సంపాదన డబ్బుతో మంత్రి బుగ్గన గెలవాలని చూస్తున్నాడని, ప్రజలు బుగ్గనను ఓడించడం ఖాయమని అన్నారు. మహిళలకు ఎంతో నష్టం జరిగిందని, రైతులు, యువత జీవితాలు నాశనం చేసిన ఘనత బుగ్గనకే దక్కిందన్నారు. పోలీసులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పెట్టే అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగేలా అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలన్నారు. అంతకముందు టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అమ్మకాలతో సీఎం జగన్ వేల కోట్లు దోచేశాడని ధ్వజమెత్తారు. అలాగే మండలంలోని అబిరెడ్డిపల్లె, వెంకటాపురం, గుమ్మకొండ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుమ్మకొండ గ్రామంలో జరిగిన జయహో బీసీ సభలో కోట్ల మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, కోట్ల గిరిధర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, విజయభట్టు, మర్రి రమణ, నల్లమేకలపల్లి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, అబిరెడ్డిపల్లె గోవిందు, ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ సర్పంచ్ రేగటి రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసభట్, భాస్కర్ నాయుడు, తిమ్మయ్య యాదవ్, రంజిత్ కిరణ్, చిట్యాల మద్దయ్యగౌడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున, మనోహర్ రెడ్డి, దశరథరామిరెడ్డి, హరిశంకర్ గౌడు, వెంకటాపురం పెద్దయ్య, వలసల బాలుడు పాల్గొన్నారు.


కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి

వైసీపీకి షాక్

బెలుం సింగవరంలో
టీడీపీలో చేరిన 50 కుటుంబాలు


టీడీపీలో చేరిన వారితో బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఏప్రిల్ 13: బనగానపల్లె నియోజకవర్గంలోని వైసీపీకి షాక్ తగిలింది. శనివారం బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలం బెలుం సింగవరం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ లో చేరారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ ఫక్కీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి బీసీ ఇందిరమ్మ టీడీపీ కండు వాలు కప్పి పార్టీలోకి బీసీ ఆహ్వానించింది. కొలిమిగుండ్ల మండలం బెలుం సింగవరం గ్రామానికి చెందిన బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, బిజ్జం విశ్వనాథరెడ్డి, కైపవెంకటసుబ్బారెడ్డి, నడిపి దస్తగిరి, నసరుద్దీన్, రఘునాథరెడ్డి, కాటా గణేశ్, తోట రామయ్య, బిజ్జం చిన్న వెంకటరామిరెడ్డి, షేక్ నన్నేబాషా, కైప వెంకటే శ్వరరెడ్డి, బొడ్డు హుసేన్‌సా, నడిపి కంబగిరి రాముడు, పెద్దకంబగిరి రాముడు, మాదిగ మద్దయ్య, షేక్ మౌలాలి, మహ్మద్‌వలి, ఫకృద్దీన్, చిన్నవలి, షేక్ మస్తాన్‌వలి, మునగల శ్రీరాములు, చిన్నకంబయ్య, నడిపి కంబయ్య, చిన్న ఓబులేసు పెద్ద ఎద్దులోడు గిరి, బాస్కర్, సురేంద్ర బూర్గుల కంబగిరి రాముడు, కృష్ణయ్య తదితర 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ అవినీతితో కబ్జాలతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన వైసీపీ పాలనకు విసుగు చెంది వైసీపీని వీడి బనగానపల్లె నియోజకవర్గంలో భారీగా టీడీపీలో చేరుతున్నారన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగం పోవాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

టీడీపీని గెలిపించండి

ప్యాపిలి, ఏప్రిల్ 13: త్వరలో జరగబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ ఓటర్లను కోరారు. శనివారం పట్టణంలో ఆమె ఇంటింటా తిరిగి ప్రజలకు టీడీపీ మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా చిత్రమ్మ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే రైతులు, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు.. యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వడంతో పాటు ఏటా జాబు క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాజా నారాయణమూర్తి, టి శ్రీనివాసులు, చల్లా వీరాంజినేయులు, మధు కుమార్, గండికోట రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 13: మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శనివారం టీడీపీ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేశారు. గ్రామానికి చెందిన చిట్టెపు శంకర్‌రెడ్డి, ఆవుల నాగార్జునరెడ్డి, విజయభాస్కరెడ్డి, జనార్దనరెడ్డి, రామిరెడ్డితో పాటు మరో 20 మంది టీడీపీలో చేశారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూడాల నారాయణరెడ్డి, చిట్టెపు రాజగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని కోవెలకుంట్ల మాజీ సొసైటీ అధ్యక్షుడు గువ్వల సుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 30 సంవత్స రాలు వెనక్కి వెళ్లిందన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందిం చడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. విద్యుత్ చార్జీలు, గ్యాస్, పెట్రోలు, డీజీల్ ధరలు పెంచి పేదప్రజల నడ్డివిరిచారన్నారు. కార్యక్రమంలో పెనుగొండ రాజశేఖర్ , కుళ్ళాయి పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీల అభివృద్ధి'

చాగలమర్రి, ఏప్రిల్ 13: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, సీమాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. శనివారం బీసీ సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్-6 పథకాలు పేదలందరికి అందుతాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కస్తూర్బా కళాశాలలో 76 శాతం ఉత్తీర్ణత


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

చాగలమర్రి, ఏప్రిల్ 13: చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా కళాశాలలో ద్వితీయ ఇంటర్‌లో 76 శాతం, ప్రథమ ఇంటర్‌లో 56 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సునీత శనివారం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో నాగ భారతి బైపీసీలో 919, పావని 905, రమీజా 843 మార్కులు సాధించారని అన్నారు. కళాశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ఎంఈవో అనూరాధ, ఎస్‌వో సునీత అభినందించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

రుద్రవరం, ఏప్రిల్ 13: రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఇంటర్‌లో శశికళ 917, వంశీ 816, మహీధర్ 828, జూనియర్ ఇంటర్‌లో సంధ్యారాణి 452 మార్కులతో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు శనివారం తెలిపారు. ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

నాటుసారా బట్టీలపై దాడులు


నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న సెబ్ సీఐ, సిబ్బంది

బనగానపల్లె, ఏప్రిల్ 13: బనగానపల్లె నియోజకవర్గంలోని అవుకు మండలం కొండమనాయినిపల్లె గ్రామానికి సమీపంలోని కొండల్లో నాటుసారా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తున్న మౌలాలినాయక్ అనే వ్యక్తి 50 లీటర్ల నాటుసారాతో పట్టుబడినట్లు సీఐ తెలి పారు. అలాగే నాటుసారాకు సిద్ధం చేసిన 1400 నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారాను సీజ్ చేసి మౌలాలినాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈదాడుల్లో ఎస్‌ఐ పోతులయ్య, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు

చాగలమర్రి, ఏప్రిల్ 13: చాగలమర్రిలోని కోదండరామ, పట్టాభిరామ ఆలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రుల సందర్భంగా మహిళలు సామూహికంగా ఒడిబియ్యం కార్యక్రమం చేశారు. 19వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా: ఎస్పీ

నంద్యాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో శనివారం పాత బస్టాండు నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బీఎస్ఎఫ్ సిబ్బందితో పాటు పోలీసు సిబ్బందిచే కవాతు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాకు నాలుగు కంపెనీల బీఎస్ఎఫ్ దళాలు వచ్చాయని, ఒక్కొక్క బెటాలియన్‌ను ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఆత్మకూరు, నంద్యాలలో విధులను అప్పగించామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ షర్ఫుద్దీన్, ట్రైనీ డీఎస్పీ రఘువీర్, పట్టణ సీఐ రమేష్‌బాబు, రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ప్రశాంత ఎన్నికలే లక్ష్యం: ఎస్పీ

చాగలమర్రి: జిల్లాలో ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి చాగలమర్రి టోల్‌ప్లాజా వద్దగల చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దులలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టులలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి అక్రమంగా నగదు, మద్యం, బంగారం, వెండి, గంజాయి, విలువైన వస్తువులు రవాణా కాకుండా అడ్డుకట్ట వేయాలని సూచించారు. అందుకు ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావు, చాగలమర్రి ఎస్‌ఐ రమణయ్య, పోలీసులు ఉన్నారు.


చాగలమర్రిలో చెక్‌పోస్టులో పత్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 13: కొలిమిగుండ్లలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉభయ రాష్ట్రాల రిటైర్డ్ మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వీడీ రాజగో పాల్ శనివారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన రచించిన భావ పరిమళ క్రోధినామ ఉగాది కవితల సంకలనం బాబాకు సమర్పించారు. కార్యక్రమంలో వీడీ నరేంద్ర కుమార్, షిరిడీ సాయి సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వీడీ రామకృష్ణ, విజయ్ కుమార్ గాన మోహన్ పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి..

చాగలమర్రి, ఏప్రిల్ 13: చాగలమర్రిలోని గాంధీ బజార్‌లో వెలసిన వీరాంజనేయస్వామికి శనివారం వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గంగమ్మకు..

రుద్రవరం, ఏప్రిల్ 13: మండలంలోని పెద్దకంబలూరులో గంగమ్మ జాతరలో భాగంగా శనివారం పూజలు ప్రారంభించారు. అమ్మవారిని పట్టుచీరతోపాటు నిమ్మమాలలు, పూలమాలలతో అలంకరించారు.

వాసాపురం వేంకటేశ్వరస్వామికి: మండలంలోని వాసాపురం వెంకటేశ్వరస్వామికి, లక్ష్మీగోదాదేవి, మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు గోపిశర్మ, శివశర్మ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని నరసాపురం, రుద్రవరం గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు శనివారం చేశారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

బేతంచెర్ల, ఏప్రిల్ 13: పట్టణ శివారులోని గాడుబావి సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు పూజలు చేశారు. అనంతరం చైత్ర శుద్ధ పంచమిని పురస్కరించుకుని ఉదయం 6.45 గంటల నుంచి 8.30 గంటలలోపు యంత్ర ప్రతిష్ఠ పూర్ణాహుతి 11 గంటలకు మృగశిర నక్షత్ర యుక్తి ధ్వజ ప్రతిష్ఠ కుంభా భిషేకం, ప్రోక్షణ అర్చన బలి కార్యక్రమాలు నిర్వహించిన అనం తరం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. హాజరైన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

బీరవోలులో..

బనగానపల్లె: మండలంలోని బీరవోలు గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. వేదపండితుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరాములు, తిరుమలయ్య, లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ఏర్పాటుకు రూ.7లక్షల విరాళం


వాటర్ ప్లాంటు వద్ద చిన్న మద్దిలేటిస్వామి కుటుంబ సభ్యులు

బేతంచెర్ల, ఏప్రిల్ 13: మద్దిలేటి నరసింహస్వామి భక్తుల కోసం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుకు ఓ భక్తుడు రూ.7 లక్షల విరాళం అందజేశారని జిల్లా దేవదాయశాఖ ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు, ఆలయ చైర్మన్ సీతారామ చంద్ర శనివారం తెలిపారు. కర్నూలు జిల్లా పెద్దటేకూరు గ్రామానికి చెందిన కురువ పాల చిన్న మద్దిలేటి, ఆయన సతీమణి లక్ష్మీదేవమ్మ, కుమారులు, కుమార్తెలు మహేష్, లోకేశ్, శారద, రాజేశ్వరి, చంద్రిక కుటుంబ సభ్యులు విరాళం అందజేశారని వారు తెలిపారు. అలాగే మిడుతూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన పెద్ద మద్దిలేటి కుమారుడు లక్ష్మణస్వామి 520 గ్రాముల వెండి వస్తువులను అందజేసినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన తలనీలాలు, పుట్టు వెంట్రుకలు రూముల బాడుగల లీజుల ద్వారా రూ.9,21,024లు భక్తుల ద్వారా దేవస్థానానికి ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.

'పశు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 13: వేసవి కాలంలో పశువుల్లో వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చిన్నవంగలి పశువైద్యాధికారి దీపకుమారి సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండటంతో మూగ జీవాలు వడ దెబ్బ బారిన పడేప్రమాదం ఉందని అన్నారు. మూగ జీవాలను ఎండలో లేకుండా నీడనిచ్చే ప్రదేశాల్లో ఎక్కువగా ఉంచాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం: అఖిలప్రియ


గోవిందపల్లె చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, ఏప్రిల్ 13: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని మాజీ మంత్రి, టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. గోవిందపల్లె గ్రామంలోని చర్చిలో ఆమె శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పలు కాలనీల్లో పర్యటించి మహిళలు, రైతులు, యువతకు టీడీపీ అందించబోయే పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో వెనుకబడిన రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించాలంటే సీఎంగా నారా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి పరాభవం తప్పదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.